విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు జిల్లా



రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం : రేషన్ డీలర్లు నిబంధన మేరకు రేషన్ షాపు నిర్వహించాలని డిఆర్డిఏ పిడి సాంబశివారెడ్డి సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని దామర మడుగు స్థానిక మూడో నెంబరు రేషన్ షాపును ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టాకు వివరాలు, తూకాలు పరిశీలించారు. పలు విషయాలపై రేషన్ డీలర్లకు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఆదేశాలతో మండలంలోని రెండు రేషన్ షాపులను ఆకస్మికతనికి నిర్వహించడం జరిగిందన్నారు. షాపులో ముఖ్యంగా నిబంధన మేరకు ఏర్పాటు చేయాల్సిన ధరలు, స్టాక్ పట్టిక సరిగా లేకపోవడం గుర్తించామన్నారు. ప్రతి డీలరు తప్పనిసరిగా టోల్ ఫ్రీ నెంబర్ తో కూడిన స్టాక్ వివరాల పట్టికను రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని సూచించారు. నిబంధన అతిక్ర మిస్తే వారిపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు ఏపీవో డైరీ భాను ప్రకాష్, ఏపీఎం లలిత, వీఆర్వో శ్రీహరి ఉన్నారు.

సహకార బ్యాంకు నూతన డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయం నెల్లూరులో ఏపీసీసీబీఏ నెల్లూరు యూనిట్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ ముఖ్య కార్య నిర్వ హణా ధికారి శంకర్ బాబు చేతుల మీదగా జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా వై సరిత జనరల్ మేనేజర్ ఎన్ ఉషారాణి డీజీఎం వై దయాకర్ రెడ్డి, డిజిఎం ఆర్ శ్రీనివాసులు , ఓఎస్డి. బ్యాంకు సహాయ జనరల్ మేనేజర్లు, శ్రీనివాసరావు , రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఏపిసిసిబిఈఏ వర్ధన్ ప్రెసిడెంట్. వెంకటసుబ్బారెడ్డి, జనరల్ సెక్రెటరీ ఏపీసీసీబీఏ నెల్లూరు. శ్రీధర్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్, రాజశేఖర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఏపీసీసీబీఏబ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వం దివాళ తీయడంతోనే పింఛన్ల రద్దు

- పక్కా ప్రణాళిక తో పింఛన్లు రద్దు చేశారు
- టీడీపీ నాయకులు సోమిరెడ్డి, బీద, అజీజ్..

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లాలో వేలాది పింఛన్లు రద్దు చేయడంతో వాటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ, జిల్లా కలెక్టర్ కు తెలుగుదేశం పార్టీ నేతలు మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పరసారత్నం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్చార్జ్ అబ్దుల్ అజీజ్, తదితర టీడీపీ నేతలు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహ న్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 20 వేలకు పైగా పింఛన్లు రద్దు చేస్తున్నట్లు లబ్దిదారులకు నోటీసులు ఇచ్చారు.. పేదోళ్లకు మూడెకరాల మాగాణి ఉందని, పదెకరాల మెట్ట ఉందని, 300 యూనిట్లకు పైగా కరెంట్ వాడారని పింఛన్లకు ఎసరుపెట్టారు నోటీసులు అందుకున్న వారికి కూడా జనవరి 1న పింఛన్లు అందిస్తామని డీఆర్డీఏ పీడీ చెబుతున్నారు ..కానీ కలెక్టర్ మాత్రం రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి నోటీసుల్లోని సమాచారం కరెక్ట్ అయితే పింఛన్లు ఆపేస్తా మంటున్నారని, 20 వేల మందికి సంబంధించి రెండు రోజుల్లో సక్రమమైన విచారణ జరుగుతుందని మాకు నమ్మకం లేదన్నారు. ఈ రోజు పింఛన్లే పోతున్నాయి...రేపు వారికి అమ్మఒడి, వాహనమిత్ర, చేదోడు, విద్యాదీవెన వంటి పథకాలను కూడా ఆపేయబోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీయడంతోనే ఇలాంటి కుట్రలకు పాల్పడి పేదలకు పథకాలు నిలిపేయబోతున్నారన్నారు. పేదలకు అండగా తెలుగుదేశం పార్టీ నిలబడుతుందన్నారు. పింఛన్లు కానీ రద్దయితే సచివాలయం స్థాయి నుంచి కలెక్టరేట్ వరకు అందరినీ నిలదీస్తాం పేదల నోట్లో మట్టికొట్టే ఈ ప్రయత్నాలు ప్రభుత్వానికి తగవు వేలాది మంది పేదలు నష్టపోతుంటే జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు...సొంత వ్యాపారాల్లో మునిగితేలుతున్నారా వైసీపీ ప్రజాప్రతినిధులకు రియల్ ఎస్టేట్లు, లేఅవుట్లు, గ్రావెల్, ఇసుక, టోల్ గేట్లు, తిప్పలు, కొండలు తప్ప ప్రజల కష్టాలు కనిపించడం లేదు ..మూడున్నరేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో ఇరిగేషన్ శాఖ భారీ కుంభకోణాలకు నిలయంగా మారింది ఒక పనికే రకరకాల కేటగిరిల్లో బిల్లులు పెట్టుకుని కోట్లకు కోట్లు ప్రజల సొత్తు కాజేశారన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటే సరి...లేదంటే న్యాయ పోరాటం తప్పదు టీడీపీ ప్రభుత్వ హయాంలో 65 వేల ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములకు సంబంధించి డీకేటీ పట్టాలు పంపిణీ చేశాం అప్పట్లో మిగిలిపోయిన వాటిని ఇంకా పరిష్కరించకపోవడం బాధాకరం అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి అసైన్మెంట్ కమిటీ ఆమోదించిన పట్టాల పంపిణీని అడ్డుకున్నారు..ఆ సమస్యను పరిష్కరించాలని కోరాం భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు విత్తనాల పంపిణీ అస్తవ్యస్తంగా జరుగుతోంది యూరియా బ్లాక్ మార్కెట్ లోకి వెళ్లిపోతుంటే వ్యవసాయ శాఖ మంత్రి ఏం చేస్తున్నారో ఆర్బీకేలకు వచ్చిన విత్తనాలు, యూరియాలను వైసీపీ నేతల ఇళ్లలో దించుకుని వారే పంచుకుంటున్నారు ప్రజా సమస్యల విషయంలో టీడీపీ రాజీ పడే ప్రసక్తే లేదు...ఇక నిరంతరం పోరాటాలే ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ... విచిత్రమైన నిబంధనల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 1.96 లక్షల పింఛన్లను వైసిపి ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తుందని అన్నారు... 250 రూపాయలు పెంచుతామని చెప్పి దాదాపు నాలుగు ఏళ్ళు వెయ్యి రూపాయల లెక్కన వైసీపీ ప్రభుత్వం ప్రజలకు కోతేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఇష్టానుసారంగా పింఛను తొలగింపు కార్యక్రమం చేపట్టిందని, రేషన్ కార్డుల పరిస్థితి గందరగోళంగా ఉందని, చిత్తశుద్ధి తో పని చేయాలని, వెరిఫికేషన్ కు సమయం తీసుకుని ప్రజలకు న్యాయం చేయాలని అన్నారు. ప్రభుత్వ లోపాల వలన, ప్రభుత్వం చేస్తున్న తప్పులకు పేద ప్రజలను బలి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. పింఛన్దారుల సమస్య పరిష్కారం కాకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు... వారితో పాటు కోవూరు నియోజకవర్గ ఇన్చార్జి పోలంరెడ్డి దినేష్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మీ సురేంద్ర, ఊరందూరు సురేంద్ర బాబు, రాజా నాయుడు, పెంచల్ నాయుడు, జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, అశ్లాం, సత్తార్, గోద పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర- నెల్లూరు: కొడవలూరు మండలంలోని పెయ్యాలపాళెం గ్రామంలో బుధవారం స్థానిక సర్పంచ్ పెనాక అనూష అధ్యక్షతన ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. పాడి రైతులకు పశువుల వ్యాధులపై రైతులకు తగు సూచనలు చేసి పాడి బీమా పథకం పశువుల 75 శాతం సబ్సిడీతో అవగాహనా కల్పించారు. ఈ పశు వైద్య శిబిరంలో 46పశువులకు పరీక్షలు నిర్వహించి ఎదకురాని పశువులకు పరీక్షలు నిర్వహించి తగు చికిత్స చేశారు. 160 గేదెలు, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. 230 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గండవరం సొసైటీ అధ్యక్షులు పెనాక శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ సురేష్ బాబు, తిరుమలేశ్వర్ రావు, పి వెంకటేశ్వర్లు కె. వెంకయ్య పాల్గొన్నారు.

అందరికీ పని కల్పించండి

విశాలాంధ్ర-ఉదయగిరి: జాతీయ ఉపాధి హామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి పని కనిపించాలని స్థానిక ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ అధికారులతో సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు తప్పనిసరిగా మాస్టర్ వేయాలని సూచిం చారు. ఆధార్ కార్డులను పరిశీలించి తక్షణమే వారికి పనులు కనిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ ఎస్ ఈ సి శ్రీనివాసులు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేపల్లె నియోజకవర్గ సమావేశంలో బీద మస్తాన్ రావు

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: రేపల్లె నియోజకవర్గ స్థాయి వైసీపీ సమావేశం రాజ్య సభ సభ్యులు, బాపట్ల జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షులు, రేపల్లె నియో జ కవర్గం ఇంచార్జి మోపిదేవి వెంకటర మణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాజ్య సభ సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ బీద మస్తాన్ రావు, తిరుపతి శాసన సభ్యులు, రీజినల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రేపల్లె నియోజకవర్గ పరిశీల కులు డైమండ్ బాబు , రేపల్లె నియోజకవర్గ మాజీ శాసన సభ్య లు, దేవినేని మల్లికార్జున, నియోజకవర్గ ఇతర నాయకులు పాల్గొ న్నారు. తదుపరి రీజనల్ కోఆర్డినేటర్లు విడివిడిగా నాయకులను కలిసి వారి అభిప్రాయాలను తెలుసుకొని వైసీపీని ముందు తీసుకు వెళ్లేందుకు దిశానిర్దేశం చేశారు.

నేడు ఇదేం ఖర్మ రాష్ట్రానికి సభ

పాల్గొననున్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు

విశాలాంధ్ర- రాపూరు: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కావలి పట్టణంలో గురువారం జరగ బో యే రాష్ట్రానికి ఇదేం ఖర్మ సభను విజయవంతం చేయడా నికి శుక్రవారం కోవురులో జరిగే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమా న్ని విజయవంతం చేసేందుకు బుధవారం కావలి పట్టణంలోని టీడీపీ కార్యాలయం లో టీడీపీ జా తీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో రాపూరు మండల స్థానికులు టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఉపాధ్యక్షులు కొండ్ల పూడి రాఘవ రెడ్డి, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి, నెల్లూరు మాజీ మేయర్ తాళ్లపాక అనురాధ, నెల్లూరు జిల్లా మాజీ జడ్పీ ఛైర్మన్ చెంచలా బాబుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి పనబా క కృష్ణయ్య, కావలి మాజీ మున్సిపాల్ ఛైర్ పర్సన్ అలేఖ్య పాల్గొన్నారు.

తాలూకా ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర- ఉదయగిరి: ఉదయగిరి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సమైక్య నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవం గా ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నుకున్నారు. పి ఎస్ సి తాలూకా అధ్యక్షులుగా ఎన్ కొండారెడ్డి సెక్రటరీ ఎస్.కె సర్దార్ కోశాధికారి కె వెంకటసుబ్బయ్య, అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర రాజు, మహిళ జాయింట్ సెక్రెటరీ నూర్జహాన్ ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు జాయింట్ సెక్రెటరీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కావలి ఏపీ జిఏ అధ్యక్షులు ఎన్ శ్రీనివాసరావు, ఎన్ శ్రీహరి ఎన్నికల అధికారు లుగా వ్యవ హరించి నూతన కమిటీని ప్రకటిం చారు. ఈ సందర్భంగా పలువురు నూతనంగా ఎంపికైన నాయకులకు పూలమాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగు లు పాల్గొన్నారు.

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర- రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీ పరిధిలోని బిట్ 3 సచివాలయ పరిధిలోని మద్దుల మడుగు నాల్గు కూడలి సెంటర్ లో వీధి దీపాలు లేక రాత్రులు ఇబ్బంది కరంగా వుందని గతంలో స్థూపం వుండేదని స్థూపం పై నాల్గు వైపుల లైట్లు వుండేవని, ఉమ్మడి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పెట్టేందు కు స్థూపాన్ని తొలగించడంతో లైట్లు కూడా తీసివేశారన్నారు. విగ్రహన్ని కూడా పెట్టే సూ చనలు లేవని అప్పటి నుండి సెంటర్ లో లైట్లు లేకపోవడం తో సెంటర్ లోని దుకాణ దారులు, ప్రజలు రాత్రి వేళలో ఇబ్బంది కరంగా వుందని నాల్గు పక్కలా వాహన రాక పోకలు,అందులో హై వే రోడ్డు వుండడంతో భయాందోళనలకు గురవుతున్నా మని సం బంధిత పంచాయతీ అధికారులు లైట్లు ఏర్పాటు చె య్యాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర- జలదంకి: సమాజంలో నిరుపేదలైన గిరిజనులు గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహనా పెంచుకొని అభివృద్ధి చెందా లని హ్యాపీ సేవా సంస్థ వ్యవస్థక అధ్యక్షులు సయ్యద్. ఘనీబాషా పేర్కొన్నారు. బుధవారం జలదంకి మండలం నెహ్రూ గిరిజన కాలనీ స్వచ్ఛంద సేవా సంస్థల గౌరవ సలహాదారు, సామజిక వేత్త ఎం. మాలకొండారెడ్డి వారి సతీమణి కీర్తి శేషులు ఎం. నాగమణి 6 వ వర్ధంతి సందర్భముగా గిరిజనుల్లో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిం చారు. తద నంతరం దాత అన్నగారి పాలెం మాజీ ఎంపీటిసి పులగం. రామారావు సహ కారంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక మంలో సామజిక వేత్త ఎం. మాలకొండారెడ్డి, పాఠశాల ఉపాధ్యా యురాలు పద్మజ, గిరిజనులు పాల్గొన్నారు.

తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే వేధింపులే కారణమన్న హర్ష

విశాలాంధ్ర - కావలి : బోగోలు మండలం కడనూతల గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పైది హర్ష బుధవారం ఆత్మహత్యా యత్నం చేశాడు. వైసీపీ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి వేధింపులు తాళలేక ఎమ్మెల్యే నివాసం ఎదుట హర్ష పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పట్టణం లోని ప్రభాకర్ నాయుడు హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న హర్షను పలువురు టీడీపీ నేతలు కలిశారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కక్ష పూరితంగా రౌడీ షీట్ ఓపెన్ చేశారని, గత కొద్ది రోజులుగా తనను వివిధ కారణాలతో వైసీపీ నేతలు వేధిస్తున్నారని హర్ష ఆవేదన వ్యక్తం చేశాడు.

హర్షను పరామర్శించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

విశాలాంధ్ర - కావలి : పట్టణం లోని గుండెమడుగుల దేవదానం మెమోరియల్ ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోగోలు మండలం కడనూతల గ్రామానికి చెందిన తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పైది హర్షను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ నాయుడు ని హర్ష యోగక్షేమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య చికిత్సను అందించాలని డాక్టర్ ని కోరారు. అనంతరం రవిచంద్ర మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో దాడులు ఎక్కువై పోయాయని, మాట వినని వారిపై కేసులు పెట్టి బెదిరించి లొంగ తీసుకోవాలని చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్

కుమార్ రెడ్డి పోలీసుల అండతో హర్ష పై రౌడీ షీట్ ఓపెన్ చేయించారని, అనేక రకాలుగా బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఎమ్మెల్యే నివాసానికి తీసుకొని వెళ్లి పార్టీలోకి రావాలని ఒత్తిడి చేశారన్నారు. అనేక రకాలుగా బెదిరింపులకు పాల్పడి ఈరోజు ఆత్మహత్య కు పాల్పడేలా చేశారన్నారు. ఈ రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఎవ్వరికీ రక్షణ లేకుండా పోయిం దన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కావలి నియోజక వర్గ ఇంచార్జి మాలేపాటి సుబ్బానాయుడు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ స్థాయి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీవీఎస్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని గుండెమడుగుల దేవదానం మెమోరియల్ హాస్పిటల్ లో టి.వి.ఎస్. మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన డాక్టర్. ఎన్. ప్రభాకర్ నాయుడు చేతుల మీదుగా టి.వి.స్. మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వార్షిక క్యాలెండర్- 2023 ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్. ఎన్. ప్రభాకర్ నాయుడు మాట్లా డుతూ ట్రస్ట్ ఛైర్మన్ తోట వెంకటేశ్వర్లు ఈ ట్రస్ట్ ను వారి తండ్రి జ్ఞాపకార్థం 2019వ సంవత్సరంలో స్థాపించి అప్పటినుండి అప్రతిహతంగా, నిరంతరం కావలి, పరిసర ప్రాంతాలలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టా రన్నారు. కోవిడ్ కష్టకాలంలో వలస కార్మికులకు ఆహారం అందిం చడం, కోవిడ్ కాలంలో భౌతిక దూరం పాటించడానికి చిహ్నంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద గొడుగులు పంపిణీ చేయడం, హాస్టల్ విద్యార్థులకు 10వ తరగతి మెటీరియల్ అందించడం, పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయడం, వికలాంగులకు ట్రైకుర్స్ అందజేయడం, వయో వృద్ధులకు దుప్పట్లు పంచడం మొదలగు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఈ సంస్థకు భవిష్యత్తులో తన సంపూర్ణ సహాయ సహకారాలు అందించగలనని తెలిపారు. ఈ కార్య క్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ తోట. వెంకటేశ్వర్లు, సెక్రెటరి గాదిరెడ్డి. హరనాథ్, కోశాధికారి వేములపాటి మాధవ, బీస్ గౌరవాధ్యక్షులు నాగిశెట్టి. శ్రీనివాసరావు, కావలి స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు ఎస్.కె. ఖాదర్ భాష పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేష న్): నెల్లూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ డివిజనుల్లో జరుగు తున్న అభివృద్ధి పనులను వేగ వంతం చేసి, ప్రజలకు అందు బాటు లోకి తేవాలని కమిషనర్ హరిత ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. కార్యా లయం లోని కమిషనర్ చాంబర్ లో వివిధ అభివృద్ధి పనుల పురో గతిపై సమీక్షా సమావేశాన్ని ఇంజనీరింగ్ విభాగం అధికారులతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 14వ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో సూచించిన అభివృద్ధి పనుల వివరాలు, నేషనల్ క్లీన్ ఎయిర్ పాలసీ అమలు విధానం, పట్టణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనుల పురోగతి, లీగల్ వ్యవహారాలు, రోడ్ మాస్టర్ డేటా, ఎం.పి లాడ్స్, హరిత నగర నిర్మాణానికి మొక్కల పెంపకం, స్మార్ట్ స్ట్రీట్ పాలసీ వంటి వివిధ అంశాల పురోగతిని కమిషనర్ అడిగి తెలుసు కున్నారు. అభివృద్ధి పనులన్నీ నాణ్యతలో రాజీ పడకుండా, అత్యంత పార దర్శకంగా, వీలున్నంత త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ అధికా రులను సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెం డింగ్ ఇంజినీర్ సంపత్ కుమార్, ఈ.ఈ సంజయ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపండి: మాజీ మంత్రి

విశాలాంధ్ర- కోవూరు: నియంత పాలనను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఈసారి జరగబోయే అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలే వైసీపీకి గుణపాఠం చెప్పాలని టిడిపి నేత మంత్రి పరసారత్నం అన్నారు కోవూరులోని టిడిపి కార్యాల యంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పరస మాట్లాడారు. జాతీయ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముప్పయిన రోడ్డు షో లో పాల్గొననున్నట్లు చెప్పారు . చంద్రబాబు రోడ్ షో బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి నాయకులకు సూచించారు. ఈ నేపథ్యంలో చెర్లపాలెం ఇనమడుగు పాటూరు గంగవరం లేగుంటపాడు వేగూరు కోవూరు తదితర గ్రామాల్లో పర్యటించి టిడిపి కార్యకర్తలకు బాబు పర్యటనపై సూచన లు ఇచ్చారు. జగన్ అరాచక పాలన తో ప్రజలు గురి అవుతున్నట్లు అన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండని జగన్ ప్రచారం చేపట్టి ఓటర్లను మభ్యపెట్టి, అధికారం చేపట్టారన్నారన్నారు. అప్పులు ఊబిలో నెట్టేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని పరస ఆరోపించారు. కోవూరు జరుగు రోడ్డు షోను ను నియోజకవర్గం ప్రజలు సక్సెస్ చేస్తారనే నమ్మకం తనుకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నేతలు, దుగ్గిరాల సుబ్బారావు, మండలం అధ్యక్షులు, ఇంతా మల్లా రెడ్డి, ఇంటూరు విజయ్, బాలరవి, వెంకటేశ్వర్లు, పైరోజ్, టీడీపీ కార్య కర్తలు తదితరులు ఉన్నారు, కోవూరు మండలం లో పలు పంచాయతీలలో ఉన్న ముఖ్య మైన టీడీపీ నాయకులను, విస్తృత తంగా కలుసుకొని బాబు రోడ్డు షో ను పాల్గొనే విదంగా పరసా రత్నం అహర్నిశలు కృషి చేస్తున్నారు బాబు ప్రోగ్రాం కోవూరు మండ లం ఇంచార్జిగా పరసా వ్యవహరిస్తున్నారు. మాజీ సీఎం స్వాగతం కోసం కోవూరు పట్టణంలో అధిక సంఖ్యలో ఫ్లెక్స్ లు ఏర్పాటు చేస్తున్నట్లు పరసా అన్నారు.

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి విశేష కృషి

విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణీ

విశాలాంధ్ర- అనుమసముద్రంపేట: రాష్ట్ర యువ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఏఎస్ పేట మండల పరిషత్ అధ్యక్షురాలు బి పద్మజా రెడ్డి, జడ్పీటిసి పి రాజేశ్వరమ్మ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీపీ అధ్యక్షతన ఎంఈఓ జ్యోతి ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు ప్రపంచ ప్రసిద్ధి చెందినవి అన్నారు. నాడు నేడు తో పాఠశాలల అభివృద్ధి తోపాటు విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలన్న ఉద్దేశంతో 8వ తరగతి విద్యార్థులకు నూతన టెక్నాలజీ తో కూడిన ట్యాబులు లక్షలాది మంది విద్యార్థులకు అందించడం సంతోషకర మన్నారు. జడ్పీటిసి రాజేశ్వరమ్మ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని సాహసం జగన్మోహన్ రెడ్డి చేస్తున్నా రని రాష్ట్రంలో ట్యాబుల పంపిణీ చేయడం ఇదే ప్రథమం అన్నారు .కార్పొరేట్ పాఠశాలలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పోటీ పడాలన్న ఉద్దేశంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాబులు ఇచ్చారన్నారు. సుమారు 300 మంది ఎనిమిదవ తరగతి విద్యార్థులు మండలంలో ఉన్నారని వారందరికీ ట్యాబులను ముఖ్యమంత్రి అందజేస్తున్నారని ఎంఈఓ జ్యోతి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలి అన్న ఉద్దేశం తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన ట్యాబులు యువ ముఖ్యమంత్రి ఇచ్చారని విద్యార్థులు వాటిని సక్రమంగా ఉపయోగించి ఉన్నత స్థితికి చేరుకోవాలని హెచ్ ఎం అబ్దుల్ హమీద్ తెలిపారు. ఏహో శ్రీనివాసరావు మొదటగా కార్యక్రమం లో పాడిన గీతాలు అలరించాయి. విద్యతోనే ఉన్నత స్థాయి వస్తుందని పేదరికం నుంచి బయటపడాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని పలువురు ప్రధానోపాధ్యాయులు తో పాటు సర్పంచ్ హజరత్ అమ్మ కోరారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా వైస్ ఛైర్మన్ శౌకత్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో ముందు చూపుతో విద్యార్థులకు ట్యాబ్ అందించారని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచి ర్యాంకులు సాధించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ముఖ్యమంత్రి రుణం తీర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్ ,తహసిల్దార్ సుభద్రమ్మ, కోఆప్షన్ సభ్యులు సంధాని భాష ,మాజీ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ అహ్మద్ ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, శ్రీధర్ ,పోతులూరయ్య, వెంకటేశ్వర్లు, మాలకొండయ్య, శ్రీ దీపు, ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి, యూపీ పాఠశాలల హెచ్ఎంలు, సిఆర్పిలు రఫీ, వెంకటేశ్వర్లు, దొరబాబు, సుశీల ,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో కారు ఢీ- పలువురుకి గాయాలు

విశాలాంధ్ర-మనుబోలు: మనుబోలు మండలం లోని చెన్నై -కలకత్తా జాతీయ రహదారిపై కొమ్మల పూడి జట్లకొండూరు సత్రం మధ్య బుధవారం ఉదయం ఆటోను కారు ఢీ కొన్న ప్రమాదంలో ఆటోలో వెళుతున్న కుటుంబ సభ్యులు ముగ్గురికి గాయాలయ్యాయి. ఆటో బోల్తా పడింది. కారు రోడ్డు పక్కన పొలాల్లో దూసుకెళ్లింది. కారు డ్రైవర్ కు ఎడమ కాలు కు తీవ్ర గాయ మైంది. రాజేష్ లక్ష్మి రమణయ్య ఆయన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఆటోలో గూడూరు కు బయలుదేరారు. నెల్లూరు నుంచి తిరుపతి వెళుతున్న కారు లారీని తప్పించే ప్రయత్నంలో ఆటోను ఢీకొంది. ఆటో రోడ్డు పక్కన బోల్తాపడగా కారు పొలం లోకి ఎడమవైపు దూసుకెళ్లింది. ఆటోలో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులకు స్వల్ప గాయా లతో బయట పడ్డారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ రావడంతో గాయపడ్డ వీరిని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో బాధితులు ఊపిరి పీల్చు కున్నారు. సంఘటన స్థలంలో ప్రజలు పెద్ద ఎత్తున గుమిగూడారు.

తడి, పొడి చెత్తను విడిగా సేకరించండి: కమిషనర్

విశాలాంధ్ర-నెల్లూరు (కార్పొరేషన్): నగర వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి కృషి చేయాలని అధికారులు, సిబ్బందిని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్య వేక్షణలో భాగంగా స్థానిక 20వ డివిజన్ వనంతోపు ప్రాంతంలో అధికారులతో కలిసి కమిషనర్ బుధవారం పరిశీలించారు. స్థానికంగా ఉన్న వివిధ వీధుల్లో డ్రైను కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, దోమల నిర్మూలనకు మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ అందజేసిన చెత్త బుట్టలలో తడి, పొడి చెత్తను విడిగా తీసి ఉంచాలని, రీ సైక్లింగ్ విధానానికి ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కమిషనర్ కోరారు. సచివాలయం పరిధిలో ఆస్తి పన్నులతో పాటు యూజర్ చార్జీల వసూళ్లను బకాయిలు లేకుండా వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఆయుష్ మాన్ భారత్ సర్వే వేగవంతం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పముజుల సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-మనుబోలు: పముజుల రామశేషయ్య సేవలు చిరస్మరణీయమని నెల్లూరు సిపిఎం నాయకులు మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం ఆయన పెద్దకర్మ సందర్భంగా ఆయన మనుబోలు మండలం మడమనూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పముజుల రామ శేషయ్య 88 సంవత్సరాలు సాధారణ చేనేత కార్మిక కుటుంబం నుండి జన్మించిన వారు తాను మగ్గం నేర్చుకుంటూ అంచెలంచలుగా ఎదిగి చేనేత వ్యాపారిగా ఎక్స్‌పోర్టుగా మూడు దేశాల్లో వ్యాపారం చేశారు. వ్యవసాయంలో కూడా అంచ లంచలుగా పెద్ద రైతుగా ఎదిగారు. వారు తను సంపాదనలో కొంత భాగం దానధర్మాలకి వినియోగించేవారు అందులో భాగమే మడమనూరు హైస్కూల్ కు 5 ఎకరాలు స్థలం, వృద్ధుల ఆశ్రమానికి ఎకరం స్థలం దానం చేశారు. ప్రతి ఒక్క వృద్ధునికి నెలకి 100 రూపాయలు చొప్పున ప్రతినెల 40 వేల రూపాయల పెన్షన్ రూపంలో ఖర్చు చేస్తున్నారు. దేవాలయాలు గ్రామంలో కొన్ని కట్టించారు. ఈ విధంగా ఆయన క్రమశిక్షణతో తను సంపాదనలో కొంత భాగం దాతృత్వంతో వ్యవహరించేవారు. ఈ దినం పెద్దకర్మకు సిపిఎం జిల్లా నాయకులు ఎం మోహన్ రావు, డా.జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ బాధ్యులు నరసింహారెడ్డి, స్థానిక సిపిఎం నాయకులు బి భాస్కరు, మముజుల నరసయ్య న్యాయవాది జక్కల అమర్నాథ్, పముజుల అజయ్ కుమార్ పాల్గొన్నారు. వారి కుమారు లు పముజుల వెంకటేశ్వర్లు, పముజుల బ్రహ్మయ్య. పముజుల వెంకటరమణయ్య, పముజుల మోహన్ రావు, మనమడు పముజుల సురేంద్రబాబు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర- నెల్లూరు (కార్పొరేషన్): నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజనుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. స్థానిక 45 వ డివిజను రామ్మూర్తి నగర్ ప్రాంతంలో జరుగుతున్న సి.సి రోడ్డు ప్యాచ్ వర్క్‌ను కమిషనర్ బుధవారం పరిశీలించారు. అభివృద్ధి పనులన్నీ అత్యంత నాణ్యత తో పారదర్శకంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. అనంత రం స్థానిక 45/1 సచివాలయాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో ఆస్తి పన్నులతో పాటు యూజర్ ఛార్జీల వసూళ్లను బకాయిలు లేకుండా వసూలు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్స్ పంపిణీ చేసిన కర్తం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్ర శాసనసభ్యులు పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఆదేశాలపై ఎంఎస్‌ఎమ్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యా యురాలు హైమావతితో కలిసి సామ్సంగ్ గెలాక్సీ ట్యాబ్స్ 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కర్తం మాట్లాడుతూ ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు 24 లక్షల రూపాయల విలువగల ట్యాబ్స్ అందించారన్నారు. ఒక్కో విద్యార్థికి అందించిన ట్యాబ్ 15 వేల రూపాయలు విలువ చేస్తుందని తెలిపారు. టాబ్స్ ఉపయోగించు బోధించడం వల్ల విద్యార్థులకు తెలియని విషయాలు నేర్చుకోవడం సులభ తరంగా ఉంటుందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గెలుపొందిన తరువాత ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని, నాడు నేడు పథకం అమలు చేసి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు అభివృద్ధి చేశారని, ఎంఎస్‌ఎం స్కూల్లో కూడా 2 కోట్ల రూపా యలు నిధులు వెచ్చించి మౌలిక వసతుల ఏర్పాటు, తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారని, స్కూల్‌ని బాగా అభివృద్ధి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో16వ డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అరబిక్ కళాశాలలో రూ.36 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ నియోజకవర్గం జమియా నూరుల్ హుదా అరబిక్ కళాశాలలో 36 లక్షల రూపా యలతో అభివృద్ధి పనులకు నెల్లూ రు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజక వర్గంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం తాము ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అరబిక్ కళాశాలలో స్నానపు గదులు , మరుగుదొడ్లు లేవని మైనార్టీలో తమ దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే తాము నిధులను మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. నెల్లూరు బారాషహీద్ దర్గాను రాష్ట్రంలోని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించా మన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా మౌలానా ఇలియాజ్, మౌలానా షేక్ అహ్మద్ సాబ్, మొహమ్మద్ జియావుల్ హక్, మౌలానా ముస్తాక్ అహ్మద్, మౌలానా ఖలీల్ సాబ్, మౌలానా శోహిత్ సాబ్, మౌలానా సమ్యుల్లా, షంషుద్దీన్ రియాజ్ పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక తోడ్పాటుకే వివిధ పథకాలు: కలెక్టర్

విశాలాంధ్రబ్యూరో- నెల్లూరు: పేదలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, ఆ పథకాల అమలుకు సంబంధించి విరివిగా రుణాలు మంజూరు చేసి వారికి ఆర్థిక స్వావలంబన కల్పించేలా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ (డి.సి.సి), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం (డి.ఎల్.ఆర్.సి) జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు అధ్యక్షతన జరిగింది. తొలుత లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ కుమార్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బ్యాంకుల కార్యకలాపాలను వివరిస్తూ జిల్లాలో వివిధ బ్యాంకులకు సంబంధించి మొత్తం 385 బ్యాంకు బ్రాంచ్ లు పనిచేస్తున్నాయని, గ్రామీణ ప్రాంతంలో 144 బ్రాంచ్ లు, సెమీ అర్బన్ ప్రాంతంలో 102, అర్బన్ ప్రాంతంలో 139 బ్యాంకు బ్రాంచ్ లు పనిచేస్తున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు సంబంధించి, ఆయా బ్యాంకుల వారీగా, బ్రాంచ్‌ల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను, సాధించిన ప్రగతిని వివరిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పథకాల అమలులో బ్యాంకులు తప్పనిసరిగా భాగస్వాములై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రెండవ త్రైమాసికంలో ఇచ్చిన లక్ష్యాలతో పాటు తొలి త్రైమాసికంలో సాధించని లక్ష్యాలను కూడా అధిగమిం చాలని కలెక్టర్ చక్రధర్ బాబు, బ్యాంకు అధికారులను ఆదేశించారు. రైతులకు లబ్ధిచేకూరేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆర్.బి.ఐ సూచనలు తప్పని సరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కౌలు రైతులకు, ఎస్సీ,ఎస్టీ, మహిళలకు విరివిగా రుణాలు మంజూరు చేసి వారు ఆర్థిక స్వావలంబన సాధించేలా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ముద్ర, టిడ్కో గృహాలకు రుణాలు, వ్యవసాయ, విద్య, ఎం.ఎస్.ఎం.ఇ, తదితర రుణాల మంజూరులో లక్ష్య సాధనలో కొన్ని బ్యాంకులు వెనుకబడి ఉన్నాయని, సంబంధిత బ్యాంకులు త్వరగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో 97 శాతం మేర బ్యాంక్ సేవలు డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందన్నారు. ఈ నెలాఖరు నాటికి నూటికి నూరు శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేలా బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్వనిధి దరఖాస్తుల పెండింగ్‌ను నిబంధన ల ప్రకారం క్లియర్ చేయాలని బ్యాంకులకు సూచించారు. వచ్చే మీటింగ్ నాటికి మరికొంత పురోగతితో రావాలని బాంకర్లకు సూచించారు. డిఆర్డిఏ, మెప్మా ల ద్వారా స్వయం సహాయక సంఘాలకు అందచేస్తున్న రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపడంతోపాటు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలకు రూ.35 వేలు అదనపు రుణ సదుపాయం పై బ్యాంకర్లు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అగ్రి ఇన్ఫ్రా కింద నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విరివిగా రుణాలు మంజూరు చేయడం పట్ల ఎన్డీసీసి బ్యాంకు సి.ఈ.ఓ శంకర బాబును, జిల్లా సహకార శాఖాధికారి తిరుపాల్ రెడ్డిలను కలెక్టర్ చక్రధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఆర్.బి.ఐ ఎల్.డి.ఓ నాగప్రవీణ్, నాబార్డు డిడిఎం రవిసింగ్, డీఆర్డీఏ పిడి సాంబశివారెడ్డి, మెప్మా పిడి రవీంద్ర బాబు, జడ్పీ సిఈఓ చిరంజీవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ రాజు, మత్స్య శాఖ జేడి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుబ్బారెడ్డి, ఏపీ ఎంఐపి పీడీ శ్రీనివాసరావు, ఎన్డీసిసి బ్యాంకు సిఈఓ శంకర బాబు, డి.సి.ఓ తిరుపాల్ రెడ్డి, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పనితీరుపై విమర్శలు గుప్పించిన ఆనం

పెన్షన్ ఇస్తే ఓట్లు వేస్తారా? ఏమ్మెల్యే ఆనం

విశాలాంధ్ర- రాపూరు: మండలం లోని సచివాలయల కన్వీనర్ లకు, వాలంటీ ర్లకు రాపూరు లోని తెలుగు గంగ అతిథి గృహం లో బుధవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఆనం ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. 'రోడ్లు గుంతలు పూడ్చ లేకపో తున్నాం.. తాగ దానికి నీళ్లు లేవంటే కేంద్ర ప్రభుత్వం జలజీవన మిషన్ కింద నిధులు ఇస్తారు.. అప్పుడు నీళ్ల ఇస్తామని చెప్పుకోవాల్సి వస్తుందని, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే మీరేం చేస్తున్నారని ప్రజలు అడుగుతున్నారని ఈ నాలుగేళ్లలో ఏం పని చేశామని ఓట్లు వేయ మని ఎలా అడగాలని ప్రాజెక్టులు ఏమన్నా కట్టామా? ఏ పనైనా , శంకు స్థాపన ఏమన్నా చేసామా? ఏమని ఓట్లు అడగాలని, పెన్షన్ ఇస్తే ఓట్లు వేసేస్తారా? ఏమి చేశామని ఓట్లు అడగాలని గత ప్రభుత్వమూ పెన్షన్ ఇచ్చిందని ఆనం తెలిపారు. ఇల్లు కడతానన్నాము..లేఔట్ లేశాం.. కట్టింది లేదని ప్రభుత్వం పై విమర్శలు గుప్పించారు. మండలంలోని సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లతో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త సత్యనారాయ ణ రెడ్డి, ఐ ప్యాక్ టీం కన్వీనర్ శబరి నాథ్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఆనం రామనారాయ ణరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను ప్రజలకు అందించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు, వైసీపీ కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి సేవ చేసేందుకే సిద్ధంగా ఉందన్నారు. సచివాలయాల కన్వీనర్లు క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలను గుర్తించి పార్టీ కోసం, ప్రజల కోసం కష్టపడి పనిచేసే వారితో కలిసి ఒక వలంటీరు పరిధిలో ఇద్దరు చొప్పున గృహ సారథులను నియమించాలని తెలిపా రు. రోడ్లు గుంతలు పూడ్చలేక పోతున్నామని, తాగడానికి నీళ్లు లేవంటే కేంద్ర ప్రభుత్వం జలజీవన మిషన్ కింద నిధులు ఇస్తారని, అప్పుడు నీళ్ల ఇస్తామని చెప్పుకోవాల్సి వస్తుంది.. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే మీరేం చేస్తున్నారని ప్రజలు అడుగు తున్నారు. ఈ నాలుగేళ్లలో ఏం పని చేశామని ఓట్లు వేయమని ఎలా అడగాలి..ప్రాజెక్టులుఏమ న్నా కట్టామా, పనులు ఏమైనా మొదలుపెట్టామా శంకుస్థాపన ఏమన్నా చేసామా ఏమని ఓట్లు అడగాలని.ఇచ్చిన యస్.యస్ కెనాల్ హామీని కూడా నెరవేర్చ లేకపోయానని ఆనం రామనారాయణరెడ్డి తన నిస్సహాయత వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చెర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, జిల్లా వైసీపీ నాయకులు పాపకన్ను దయాకర్ రెడ్డి, చెన్ను భాస్కర్ రెడ్డి, మండల వైసీపీ నాయకులు శ్రీకి రెడ్డి శశిధర్ రెడ్డి, నల్ల వడ్లవేంకటరమణారెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కలిసిన పేర్నాటి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్ కలిశారు. నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ శాసనసభ్యులు, నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంపై వైసీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి చర్చించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి పట్టభద్ర ఓటర్లకు పాంప్లెట్స్ ఇచ్చే కార్యక్రమం మొదలైందని, నెల్లూరు రూరల్ నియోజక వర్గంలో కూడా ఏ విధంగా ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టాలనే అంశంపై ఎమ్మెల్సీ అభ్యర్థి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు , రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో చర్చించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి, బార్ అసోసియేషన్, మెడికల్ అసోసియేషన్, విద్యా సంస్థలతో సమావేశాలు ఏర్పాటు చేయిం చాలని ఎమ్మెల్సీ అభ్యర్థి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని కోరగా, సానుకూలంగా శ్రీధర్ రెడ్డి జనవరి మొదటి వారం నుంచి వివిధ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తామని ఎమ్మెల్సీ అభ్యర్థికి తెలిపారు.

రెడ్ క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి సన్మానం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) వారు ఆంధ్ర రాష్ట్ర పరిధిలో నాటా సేవా డేస్ కార్యక్రమం నిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా నెల్లూ రు జిల్లా నిడుగుంట పాలెం గ్రామ వాసి ప్రేమ్ సాగర్ రెడ్డి అమెరికా లో 50కు పైగా హాస్పిటల్స్‌ను నిర్వహి స్తూ భారతదేశం గర్వించదగిన వ్యక్తిగా అమెరికాలో గుర్తింపు పొందారు. ఇప్పటికే ప్రేమ్ సాగర్ రెడ్డి తన స్వంత గ్రామం అయిన నిడుగుంట పాలెం తోపాటు ఆంధ్రరాష్ట్రం లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు వి పి ఆర్ ఫంక్షన్ హాల్లో ప్రేమ్ సాగర్ రెడ్డికి విశ్వ వైద్య విభూషన్ అవార్డు ను ప్రధానం చేశారు. ఇందులో భాగంగా నెల్లూరు రెడ్ క్రాస్ చైర్మన్ ,కృష్ణ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ప్రేమ్‌సాగర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సత్కరించారు.

కక్షసాధింపులు తప్ప..అభివృద్ధి ఎక్కడుంది..?

- తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలి..
- లేని పక్షంలో మహిళలందరం రోడ్డెక్కుతాం..
- సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం
- టీడీపీ సిటీ ఇన్‌చార్జి కోటంరెడ్డి సతీమణి సంధ్యా

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: 'నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కక్ష సాధింపులు తప్ప.. అభివృద్ధి ఎక్కడుంది?' అని టీడీపీ నెల్లూరు సిటీ ఇన్చార్జి కోటంరెడ్డి సతీమణి సంధ్యా ప్రశ్నించారు. ఇదేం ఖర్మ మన రాష్టానికి కార్యక్రమాన్ని 42 కస్టర్ ఇన్‌చార్జి జకీర్, 42వ డివిజన్ ఇన్చార్జి మస్తాన్ ఆధ్వర్యంలో జరిగిన ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి అనే ప్రోగ్రామ్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇంటింటికి వెళ్లిన ఆమెను ప్రజలు తమ ఇంటి ఆడపడుచులా అక్కున చేర్చుకుని.. ఆప్యాయంగా మాట్లాడారు. కోటంరెడ్డి ఆరోగ్యం ఎలా ఉందంటూ ప్రజలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్టంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. సామాన్యులు బతికే పరిస్థితులు లేదన్నారు. అభివృద్ధి గురించి ప్రశ్నించినా.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా.. కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సిటీ నియోజవర్గంలో గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ చేసిన అభివృద్ధి కనిపించడం లేదని ఆమె విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే.. సామాన్యులు మూడు పూటలా అన్నం తినగలుగుతారని ఆమె పేర్కొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి

- బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర- నెల్లూరు: ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో దాదాపు పది లక్షల మంది ఎస్సీ నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా, ఉపాధి లేకుండా బ్యాంకుల నుంచి, ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఎలాంటి రుణాలు లేకుండా ఎస్సీల ఆర్థిక మూలాలు పూర్తిగా నేలమట్టం చేసి నిరుద్యోగులను రోడ్డున పడేసిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి ఎస్సీ కాలనీలో మౌలిక వసతులైన ఇళ్లు, రోడ్లు డ్రైనేజీలు లేవని, ఆఖరికి ఉన్న అర్థ సెంటు భూమిని అర ఎకరా భూమిని లాక్కొని ప్రభుత్వ భూములను బినామీ పేర్ల మీద మార్చడం ,ఎస్సీల మీద జరుగుతున్న దాడులకు న్యాయం చేయకపోవడం తగదని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎల్లు సాల్మన్ రాజు పేర్కొన్నారు ఎస్సీలను వేధించడంలో జగన్మోహన్ రెడ్డి సక్సెస్ అయ్యాడని గతంలో చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 3,000, ఎస్సీ హాస్టల్ మూసివేసి దళితులకు విద్యను దూరం చేసి అనేక సమస్యల మీద గత మూడు సంవత్సరాలుగా బిజెపి ఎస్సీ మోర్చా పోరాటం చేస్తుందని ఎస్సీ కార్పొరేషన్ కలెక్టర్ ఆఫీస్ ముట్టడించి బస్తీ సంపర్క్ అభియాన్

ద్వారా 35 రోజులు 12,500 కిలో మీటర్లు 890 మండలాలు దాదాపు 170 నియోజక వర్గాలు తిరిగి ప్రతి దళితులను కలిసి ఎస్సీలకు జరుగుతున్న అన్యాయం వివరించి. కనీసం దళితులకు రాష్ట్రంలో శ్మశాన వాటికలు కూడా లేకుండా చేయడం ఎంతో కారణమని దేశవ్యాప్తంగా 1,60,000 కోట్లు రూపాయలు నిధులు మంజూరు అయితే ఈ రాష్ట్రానికి 32 వేల కోట్ల రూపాయలు కేటాయించారని ఈ నిధులను ముఖ్యమంత్రి దారి మళ్లించి ఎస్సీల అభివృద్ధి నాశనం చేయలేదని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని దళితుల నిరుద్యోగ ఆకలి బతుకు దెరువు మీద పోరాటం చేస్తున్న ఎస్సీలకు న్యాయం జరిగే వరకూ రాజీలేని పోరాటం చేస్తుంటామని నిన్న, నేడు గుంటూరు కలెక్టర్ ఆఫీస్ ముందు ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కా చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్య, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు దేవానంద్, ఎస్సీలకు చెందాల్సిన 27 పథకాలను ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దుర్వినియోగం కాకుండా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నామని తెలిపారు.

విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర- ఉలవపాడు: ఇటీవల కా లంలో వచ్చిన తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలోని కరేడు పంచాయతీ లో సుమారు 105 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించగా 80 శాతం రాయితీపై నూట యాభై క్వింటాళ్ల విత్తనాలను మండల వ్యవసాయ శాఖ అధికారి బి తిరుమల జ్యోతి ఆధ్వర్యంలో కరేడు సర్పంచ్ వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ముత్యాల శేషగిరి రావు, గ్రామ వ్యవసాయ కార్యకర్త వంశీ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణపై అధికారుల నిలదీత

విశాలాంధ్రబ్యూరో-నెల్లూరు: కాలువ పై ఆక్రమణ అంటూ కలర్స్ ప్లాజా వద్ద వైసిపి మైనారిటీ భాగం నాయ కుడు మున్వర్ షాపు వద్ద ఆక్రమ ణలు చేశారని కాల్ చేయడంతో మంగళవారం రాత్రి నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారి ధనుంజయ రెడ్డి జెసిబి తో మెట్లను తొలగించారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న ఇండియన్ నేషనల్ లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సమీ హుసేని టౌన్ ప్లానింగ్ అధికారి ధనుంజయ రెడ్డిని ప్రశ్నించారు. ఏ కారణం చేత ప్రజలకు ఏ విధమైన ఇబ్బంది గాని ఆటంకం గాని కలగని ఈ షాపు ముందు ఆక్రమణలు ఏమున్నా యని ప్రశ్నించారు. చందన బ్రదర్స్, ట్రంకు రోడ్డు రోజురోజుకీ ఆక్రమణలు పెరిగి ప్రమాదాలు జరుగుతుంటే అధికారుల కళ్లకు అవి కనిపించవా? అని ఆయన నిలదీశారు. ముస్లిం మైనార్టీ కావడం వల్ల ఉద్దేశపూర్వకంగానే కక్ష సాధిస్తున్నారని దీని ఫలితం అనుభవిస్తారన్నారు. సాయంకాలం తొలగించాలని వచ్చిన డిప్యూటీ మీరు రాకతో ప్రక్రియ నిలిపారు. రాత్రి పని ముగించారు.. ఏమిటి ది అంటూ మైనార్టీ నేతలు అధికారుల తీరును ఎండ కడు తున్నారు.

ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులుగా సాయికృష్ణా రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు: ఏబీవీపీ 41వ రాష్ట్ర మహా సభలు కర్నూలులో ఇటీవల జరిగాయి. ఈ రాష్ట్ర మహా సభలలో నూతన రాష్ట్ర కార్య వర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు మురళి ధర్ ప్రకటిం చారు. ఈ నూత న రాష్ట్ర కార్య వర్గంలో నెల్లూరు జిల్లా నుండి రాష్ట్ర కార్యసమితి సభ్య లు (వర్కింగ్ కమిటీ సభ్యులు) గా విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్న వై. సాయికృష్ణా రెడ్డిని ఎన్నుకున్నారు. అదే విధంగా యూనివర్సిటీలో ఎంబీఏ చదువుతున్న వెంకట రమణను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయికృష్ణా రెడ్డి మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను ఇచ్చిన రాష్ట్ర శాఖకు ధన్యవాదాలు తెలిపారు. తనకి అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా బాధ్యతగా నిర్వహిస్తానని తెలిపారు. విద్యారంగ సమస్యల పై విద్యార్థులతో కలిసి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వీరికి ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

విద్యా అమృత్ మహోత్సవ్‌పై శిక్షణ

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: బుచ్చిరెడ్డి పాలెం మండలంలోని ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు బుధవారం విద్యా అమృత్ మహోత్సవ్ పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన గండికోట సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులలో, పిల్లలలో దాగివున్న వినూత్న ఆవిష్కరణలను గుర్తించి, అందరికీ అందించడానికి ఈ కార్యక్రమం చక్కగా ఉపయోగపడు తుందన్నారు. ఈనెల 31వ తేదీ లోపల ప్రతి ఉపాధ్యాయుడు ఒక ప్రాజెక్టు తయారు చేసి దీక్ష యాప్ లో అప్లోడ్ చేయాలని కోరారు. బోధనలో ఎదుర్కొనే సమస్యపై 5 నిమిషాల నిడివి కలిగిన వీడియో రూపొందిం చాలన్నారు. దేశంలోని ఉత్తమ బోధనా విధానాలను గుర్తించడానికి, సంక్షోభ సమయంలో ఉపాధ్యాయులు అనుసరించిన నూతన బోధనా విధానాలను ప్రతి ఒక్కరూ తెలుసు కోవడానికి ఎస్సీఈఆర్టీ ఈ కార్యక్రమాన్ని రూపొందించిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయులు భాగస్వామ్యులై బుచ్చిరెడ్డిపాలెం మండలాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్పి లు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర- బుచ్చిరెడ్డిపాలెం: 2023 ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఉదయం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి దేవస్థానక్యాలెండర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు తిరుమూరు సుప్రజ, గుమ్మా రఘు రామయ్య, ఆములూరు విమల, గుంటూరు కామేశ్వరి , ముంగర శివకుమార్, ఎక్స్ ఆఫీసీయో సభ్యులు శ్రీశైలం శశి శేఖర్ శర్మ , దేవస్థాన ప్రధాన అర్చకులు వివిఎస్ గంగా ప్రసాద్, ఆలయ అర్చకులు, బుచ్చిరెడ్డి పాలెం, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చిరెడ్డి పాలెం ఎస్ఐ వీర ప్రతాప్ పాల్గొన్నారు.

కుంటి సాకులతో పేదోళ్ల పింఛన్లు నిలిపివేతకు నిరసన

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని వెంకటేశ్వర పురం 53/1 సచివాలయం ఎదుట సీపీఎం 53వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో పింఛన్లు నిలిపివేతకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో ఒక్కొక్క డివిజన్లో 90 నుండి 130 పింఛన్ల వరకు కుంటి సాకులు చూపించి నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పేరు మీద పింఛను దారులకు నోటీసులు అందజేశారన్నారు. ఈ చర్యల వల్ల పింఛను దారు లందరూ తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ చర్యలపై ఏమీ తెలియనట్లు ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, దొంగే దొంగ దొంగ అని అరిచిన చందంలా వ్యవహరిస్తున్నారన్నారు. వీరికి చిత్తశుద్ధి ఉంటే జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించాలని డిమాండు చేశారు. కరెంటు చార్జీలు పెంచి ఆ బిల్లును సాకుగా చూపించి పింఛన్లు నిలిపివేయడం ఎంత మేరకు సబబని అన్నారు. మంజూరు సమయంలో అన్ని రకాల విచారణలు జరిపి పింఛను ఇచ్చారని పింఛన్ల కోత విధించ దానికి నేడు కుంటి సాకులు చూపడం సిగ్గుచేటైన చర్యఅని, ఏ విచారణ లేకుండా అందరికీ పింఛన్లు యథాప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 30వ తేదీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయం సెక్రటరీకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, శాఖ కార్యదర్శి నక్క వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు షకీలమ్మ, భార్గవి, ధనమ్మ, సుశీలమ్మ, బాబి, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రమేష్ పాల్గొన్నారు.

ముగ్గులు.. ఆటల పోటీలు

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు రూరల్ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉమన్స్ పాలిటెక్నిక్ కళాశాలలో ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ ఐద్వా కళాశాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. విజేతలకు ఎస్ఎఫ్ఐ నెల్లూరు రూరల్ కమిటీ బహుమతులు అందించారు. నెల్లూరు రూరల్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సుకుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఇంటర్మీడియట్ గవర్నమెంట్ కళాశాలకు మౌలిక వసతులు, విద్యార్థులకు చదవడానికి బుక్స్ కూడా లేవని, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనకు అర్హత వున్నా అందటం లేదు నిరసన తెలిపారు. స్థానికంగా ఉండే గవర్నమెంట్ స్కూల్స్ అండ్ కాలేజీలలో చదువుకోవడానికి ఉపాధ్యాయులు కూడా లేరన్నారు. వెంటనే విద్యారంగ సమస్యలపై చర్య తీసుకుని విద్యార్థులకు రావాల్సిన వసతులు అన్ని అందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు.

సొంత పార్టీ నాయకుల దుకాణాలపై దాడి అమానుషం

- డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్



విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటరు వద్ద వైసీపీ మైనారిటీ నాయకుడు, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ మునవర్ కు చెందిన కలర్స్ ప్లాజా దుకాణాన్ని మునిసిపల్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. అని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ అన్నారు. నెల్లూరు నగర నియజకవర్గానికి చెందిన మైనారిటీ నాయకుడు, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ మునవర్ వైసీపీ ఆవిర్భావం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెంట నడిచిన వ్యక్తిని ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ఇటీవల జరిగిన వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేకు కట్ చేసి, పేద మహిళలకు చీరల పంపిణీ చేసిన పాపానికి మునిసిపల్ అధికారులు మునవర్ దుకాణాన్ని కూల్చివేయడానికి వచ్చారన్నారు. విషయం తెలుసుకుని వెంటనే తాను తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మైనారిటీ నాయకులు, కార్య కర్తలు ఇక్కడికి వచ్చి అధికారులను అడిగితే తమకు ఎవరో ఫోన్ చేశారని, పొంతనలేని సమాధానాలు చెప్పి అందుకనే వచ్చామని వెంటనే అధికారులు వెళ్లిపోయారన్నారు. అయితే తిరిగి అర్ధరాత్రి 1గంట ప్రాంతంలో దొంగల్లా వచ్చి కాలువ పూడికతీత కోసం మునవర్ దుకాణం మెట్లను పగులగొట్టామని అధికారు లన్నారని ఆయన చెప్పారు. కాలువ పూడికలు తీయాలని అనుకుంటే అన్ని దుకాణాల ముందు పగులగొట్టాలని అలా కాకుండా మునవర్ దుకాణం ముందే ఎందుకు పగులగొట్టారని ప్రశ్నించారు. మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్, 10 సంవత్సరాలు జగనన్న ముఖ్యమంత్రి కావడం కోసం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. పక్కనే 25 అడుగుల రోడ్డులో 7 అంతస్థుల భవనం నిర్మాణం జరుగుతుంటే దానిపై అనేక ఫిర్యాదులు వస్తే కార్పొరేషన్ అధికారులు మాత్రం కళ్లు మూసుకు పోయారన్నారు. మునవర్ కి చెందిన ఈ కొట్టు ఆక్రమణ కాదని, దురాక్రమణ కాదని, ప్రభుత్వ ఆస్తి కాదని, చిన్నపాటి లోపం కూడా లేదన్నారు. పార్టీ కోసం కష్టం చేస్తున్న వారికి అన్యాయం జరగకుండా దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నటువంటి వారిమీద కఠినమైన చర్యలు తీసుకోవాలని జగనన్నని వేడుకుంటున్న అని అన్నారు. పార్టీ కోసం కష్టం చేసి కార్యక్రమాలు చేసి పార్టీ పరంగా అన్ని నష్టపోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, ఇంతియాజ్, గోగుల నాగరాజు. నాయకులు మునవర్, హాజీ పాల్గొన్నారు.